
సాక్షి
వికారాబాద్

శనివారం । 9 । నవంబర్ । 2024



సాగుకు ప్రణాళికలు

యాసంగిలో క్యాబేజీ, కాలిఫ్లవర్, టమాటా, మిర్చి వంటి పంటలు సాగు చేసుకోవచ్చని వ్యవసాయాధికారులు తెలిపారు. 8లో▸



ఆకతాయిల ఆటకట్టిస్తాం

ట్రాఫిక్ నిబంధనలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని వికారాబాద్ ఎస్‌ఐ సత్యనారాయణ అన్నారు. 8లో▸



సరిహద్దు దాటుతున్న 'రేషన్'

తెల్లరేషన్ కార్డు దారులకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న బియ్యాన్ని అక్రమార్కులు అంతర్రాష్ట్ర సరిహద్దులు దాటిస్తున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

సీఎంకు జన్మదిన శుభాకాంక్షలు



పరిగి: సీఎం రేవంత్‌రెడ్డికి పరిగి ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం నగరంలోని ఆయన నివాసంలో సీఎంకు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

రికార్డుల పరిశీలన



తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ ఉమాశంకర్

యాలాల: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భూ రిజిస్ట్రేషన్లలో భాగంగా ధరణి ఫైల్స్‌కు ప్రొసిడింగ్స్ జతపరచాలన్నారు. ప్రొసిడింగ్స్ లేనిపక్షంలో పట్టాదారు వంశ వివరాల పత్రాలను జత చేసి భద్రపరచాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అంజయ్య, ఆర్‌ఐ సాయిచరణ్, జూనియర్ అసిస్టెంట్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లుగా నమోదు చేసుకోండి



ఓటు హక్కుపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ విజయకుమార్

కొడంగల్: అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటర్లుగా పేర్లు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ విజయకుమార్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని నవంబర్ 9, 10 తేదీల్లో చేపట్టినట్లు తెలిపారు. ఓటర్లు ఎవరైనా చనిపోయి ఉంటే జాబితా నుంచి పేర్లను తొలగించుకోవాలని కుటుంబ సభ్యులను కోరారు. ఓటరు నమోదుకు, జాబితాలో అభ్యంతరాల సవరణను అవకాశం ఉందన్నారు. ఇందుకోసం పోలింగ్ బూతుల్లో బీఎల్‌ఓలు అందుబాటులో ఉంటారని తెలిపారు.

టీయూటీఎఫ్ రాష్ట్ర మహాసభను సక్సెస్ చేయాలి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘం సభ్యులు

పరిగి: త్వరలో జరగబోయే తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీయూటీఎఫ్) రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి కోరారు. శుక్రవారం పరిగి పట్టణంలో ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 10న ఆదిలాబాద్‌లో రాష్ట్ర మహాసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సంఘం పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ గోపాల్, నాయకులు శంకర్, జాంప్ల, బస్వరాజ్, బాలమణి తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్ ఫుల్



సన్నరకం వడ్లకు మంచి గిరాకీ

- పొలాలవద్దే కొనుగోలు చేస్తున్న వ్యాపారులు
- బహిరంగ మార్కెట్‌లో బియ్యం ధరలు అధికంగా ఉండటమే కారణం
- రూ.500 బోనస్ ప్రకటించినా కేంద్రాలకు స్పందన కరువు
- ఈ ఏడాది 30వేల ఎకరాల్లో పంట సాగు

వికారాబాద్: సన్న రకం ధాన్యానికి ఓపెన్ మార్కెట్‌లో మంచి డిమాండ్ కనిపిస్తోంది. బియ్యం ధరలు అధికంగా ఉండటంతో సన్నరకం వడ్లకు డిమాండ్ పెరిగింది. దీంతో వ్యాపారులు వడ్లు కొనుగోలుకు ఎగబడుతున్నారు. ఏకంగా పొలాల వద్దకే వెళ్లి బేరం ఆడుతున్నారు. నూర్పిడి కాకముందే బయాన ఇచ్చే పంట తమదే అనిపించుకుంటున్నారు. ఈ ఏడాది సన్న రకం వడ్ల సాగు గణనీయంగా పెరిగింది. గతేడాదితో పోలిస్తే రెండింతలు సాగు చేశారు. ప్రభుత్వం ప్రతినెలా పౌర సరఫరాల శాఖ ద్వారా రేషన్‌కార్డు లబ్ధిదారులకు దొడ్డు బియ్యం పంపిణీ చేస్తోంది. త్వరలో సన్న బియ్యం పంపిణీ చేస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సన్న రకం వడ్ల సాగుకు రైతులు మొగ్గు చూపారు. పంట మొత్తాన్ని రైతులు కొనుగోలు కేంద్రాలకు తరలిస్తే తమ వ్యాపారం దెబ్బతింటుందని భావించిన దళారులు నూర్పిడి కాకముందే పొలాలకు వెళ్లి వడ్లు కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు వరి సాగులో కేవలం 10శాతం మాత్రమే సన్న రకం వేసేవారు. పంట దిగుబడిని బహిరంగ మార్కెట్‌లోనే విక్రయించేవారు. ఏటా కొనుగోలు కేంద్రాలకు ఐదు శాతం కూడా వచ్చేది కాదు. త్వరలో రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీ చేయనుండటంతో ప్రభుత్వమే పంట మొత్తం కొనుగోలు చేయాలని భావిస్తోంది. ఇందుకోసం ప్రత్యేక కౌంటర్లను కూడా ఏర్పాటు చేసింది. అంతేకాకుండా క్వింటాలుకు రూ.500 బోనస్ ప్రకటించింది. దీంతో రైతులు కొనుగోలు కేంద్రాలకు తరలించేందుకు మొగ్గు చూపుతున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన దళారులు రైతులకు అధిక ధర ఆశ చూపి పొలాల వద్దే పంట కొనుగోలు చేస్తున్నారు.

ఇప్పటికీ ఇతర రాష్ట్రాల నుంచే..

జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం 93వేల ఎకరాలు కాగా ఈ ఏడాది 1,30,000 ఎకరాల్లో వరి పంట చేశారు. అత్యధికంగా పరిగి వ్యవసాయ డివిజన్‌లో 46,876 ఎకరాల్లో పంట వేశారు. కొడంగల్ డివిజన్‌లో 45,137 ఎకరాల్లో, తాండూరు డివిజన్‌లో 29,964 ఎకరాల్లో, వికారాబాద్ డివిజన్‌లో 8,023 ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. గతేడాదితో పోలిస్తే ఈ సారి సన్నరకం వరి సాగు భారీగా పెరిగింది. గతేడాది 14 వేల ఎకరాల్లో పంట సాగు చేయగా ప్రస్తుత సీజన్‌లో 30 వేల ఎకరాల్లో పంట వేశారు.

మొత్తం పంట సేకరిస్తేనే..

జిల్లాలో 2,41,622 రేషన్ కార్డులు ఉన్నాయి. ప్రతి నెలా లబ్ధిదారులకు 4,673 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేయాల్సి ఉంటుంది. ఈ లెక్కన ఏడాదికి 56,076 మెట్రిక్ టన్నులు బియ్యం అవసరం అవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ ఏడాది జిల్లాలో 30వేల ఎకరాల్లో సన్న రకం వడ్లు సాగు చేశారు. యాసంగి సీజన్‌లో మరో 30వేల ఎకరాల్లో పంట సాగయ్యే అవకాశం ఉంది. ఈ రెండు సీజన్లలో 1.20లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి రావచ్చని అధికారులు భావిస్తున్నారు. మొత్తం పంటను సేకరిస్తే 65 నుంచి 70 వేల మెట్రిక్ టన్నులు కావచ్చని అధికారులు అంటున్నారు. ఈ మొత్తం ధాన్యాన్ని కొనుగోలు చేస్తేనే రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీకి ఎలాంటి ఇబ్బందులు ఉండవు.

చట్టాలపై అవగాహన అవసరం

జిల్లా న్యాయసేవాధికార సంస్థ ప్రధాన కార్యదర్శి, న్యాయమూర్తి డీబీ శీతల్



సమావేశంలో మాట్లాడుతున్న డీబీ శీతల్

అనంతగిరి: చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ప్రధాన కార్యదర్శి, న్యాయమూర్తి డీబీ శీతల్ అన్నారు. జాతీయ న్యాయసేవా అధికార సంస్థ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం వికారాబాద్ మండలం మదన్‌పల్లిలో రైతులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విత్తనాలు కొనుగోలు చేసే రైతులు విధిగా రసీదులు పొందాలన్నారు. భవిష్యత్‌లో పంట దెబ్బతింటే తగిన చర్యలకు అవకాశం ఉంటుందన్నారు. అలాగే విత్తనాలు, ఎరువులు కొనుగోలు విషయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. తెలిసీ తెలియక ఏమైనా కేసులు అయ్యి కోర్టు చుట్టూ తిరుగుతున్న వారు న్యాయవాదిని పెట్టుకునే స్తోమత లేకపోతే తమను సంప్రదిస్తే వారికి ఉచిత న్యాయ సహాయం చేస్తామన్నారు. లోక్‌అదాలత్‌లో ఇరువర్గాలు రాజీ కుదుర్చుకుంటే ఇద్దరూ గెలిచినట్లేనని పేర్కొన్నారు. రాజీమార్గమే రాజమార్గమన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ అనిత, చీఫ్ లీగల్ ఎయిడ్ న్యాయవాదులు వెంకటేశ్, రాము, న్యాయవాది అవుటి రాజశేఖర్ పాల్గొన్నారు.

మొక్కలతోనే మానవాళి మనుగడ



మొక్క నాటి నీరు పోస్తున్న జగద్గురు శంకరాచార్య స్వామీజీ తదితరులు

కడ్తాల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, మొక్కలతోనే మానవాళి మనుగడ సాధ్యమని ఉత్తరాఖండ్ రాజరాజేశ్వరి ఆశ్రమం జగద్గురు శంకరాచార్య స్వామీజీ అన్నారు. మండల పరిధిలోని అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలోని ఎర్త్‌సెంటర్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కౌన్సిల్‌ఫర్ గ్రీన్ రెవల్యూషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు లక్ష్మారెడ్డితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ.. వాతావరణ సమతుల్యతను కాపాడడంలో మొక్కలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో ఉత్తరాఖండ్ ఆశ్రమ పీఠాధిపతులు, స్వామీజీలు నందు సరస్వతి, ప్రకాశ్‌నంద, మాజీ సర్పంచ్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ వెంకటరవణ

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరగాలి

డీఎంహెచ్‌ఓ వెంకటరవణ

అనంతగిరి: ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించి రోగులకు మెరుగైన వైద్యం అందించాలని డీఎంహెచ్‌ఓ వెంకటరవణ సూచించారు. శుక్రవారం వికారాబాద్‌లోని తన కార్యాలయంలో జిల్లాలోని ప్రోగ్రాం ఆఫీసర్లు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు, అన్ని పీహెచ్‌సీల డాక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని రకాల జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలులో పీహెచ్‌సీ వైద్యాధికారుల పనితీరు ఆధారంగానే జిల్లా వైద్యశాఖ ప్రగతి ఆధారపడి ఉంటుందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని సిబ్బంది విధిగా సమయపాలన పాటించాలన్నారు. ప్రస్తుతం అమలులో ఉన్న వ్యాధి నిరోధక టీకాలు, మాతాశిశు సంరక్షణ సేవలు, కీటక జనిత వ్యాధులైన డెంగీ, మలేరియా నివారణ చర్యలపై నిరంతరం పర్యవేక్షించాలన్నారు. బీపీ, షుగర్, క్యాన్సర్ వంటి వ్యాధుల నివారణ కోసం నిరంతరం స్క్రీనింగ్ ప్రక్రియ కొనసాగించాలన్నారు. పొగాకు ఉత్పత్తులు వాడటం వలన కలిగే అనర్థాల గురించి అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా గర్భిణులకు అన్ని రకాల వైద్య సేవలు, సౌకర్యాలు అందేలా చూడాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా చొరవ తీసుకోవాలన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పీహెచ్‌సీలలో కనీస మౌలిక సదుపాయాలైన తాగునీరు, శానిటేషన్, ఫర్నిచర్ వంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు జీవరాజు, రవీంద్ర యాదవ్, ప్రోగ్రాం ఆఫీసర్లు బుచ్చిబాబు, నేహ, నిరోషా, శ్రీనివాసులు, నాగమల్లేశ్వరరావు, నర్సింలు, పీహెచ్‌సీ వైద్యాధికారులు, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందాలి

- కలెక్టర్ ప్రతీక్‌జైన్



యాలాల పీహెచ్‌సీని పరిశీలించి సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

యాలాల/ధారూరు: ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ వైద్యులకు సూచించారు. శుక్రవారం యాలాల పీహెచ్‌సీని ఆయన సందర్శించారు. ఇటీవల పీహెచ్‌సీలో వివిధ మరమ్మతు పనులు, వసతుల కోసం రూ.7 లక్షలతో ప్రతిపాదనలు పంపారు. ఓపీ, రూఫ్ లీకేజీలు, లేబర్ రూం, టైల్స్, ప్రహరీ ఫెన్సింగ్, కిటికీలు, గీజర్, వైఫై కనెక్షన్, ఇన్వర్టర్, ప్రింటర్ కోసం ఎంతే మేర ఖర్చు చేయాల్సి ఉంటుందని కలెక్టర్ ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వైద్యులు రోగులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అంతకుముందు అగ్గనూరు సమీపంలోని మారుతీ జిన్నింగ్ మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. పత్తిలో తేమ శాతం 8 ఉంటే ప్రభుత్వ మద్దతు ధర రూ.7,521 చెల్లించడం జరుగుతుందన్నారు. తేమకు అనుగుణంగా రైతులు తమ పంటను కేంద్రానికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అంజయ్య, ఎంపీడీఓ పుష్పలీల, ఎంపీఓ యాదయ్య, ఆర్‌ఐ సాయిచరణ్ తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, ఆస్పత్రికి వచ్చే రోగులకు సకాలంలో వైద్యం అందేలా చూడాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆదేశించారు. శుక్రవారం ధారూరు, నాగసమందర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేశారు. ధారూరు పీహెచ్‌సీలో ఏడేళ్లుగా మరుగుదొడ్ల వినియోగంలో లేవని సిబ్బంది తెలిపారు. భవనం పైనుంచి నీరు కారడాన్ని గమనించిన కలెక్టర్ వెంటనే మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. విద్యుత్ వైరింగ్ సమస్య, వాటర్ ట్యాంకులు లేని విషయాన్ని సిబ్బంది కలెక్టర్ దృష్టికి తెచ్చారు. వీటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం ఓపీ రిజిస్టర్‌ను పరిశీలించి రోగుల సంఖ్య తక్కువగా ఉండటంపై ఆరా తీశారు. గర్భిణులు వైద్యం కోసం ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. ఒకటి నుంచి ఆరో నెల వరకు ఇక్కడ, ఏడు నుంచి తొమ్మిదో నెల వరకు వికారాబాద్, తాండూరులోని ప్రసూతి కేంద్రాల్లో వైద్యం పొందుతున్నట్లు సిబ్బంది వివరించారు. అనంతరం డాక్టర్ గదిని పరిశీలించి డాక్టర్ ఎక్కడ అని ప్రశ్నించడంతో సిబ్బంది తడబడ్డారు. ఆ తర్వాత మందుల గదిని, ఆయుష్ డాక్టర్ గదిని, ల్యాబ్, ఓపీ రూంను పరిశీలించారు. ఆస్పత్రి భవనానికి మరమ్మతులు చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట మండల ప్రత్యేక అధికారి మల్లేశం, తహసీల్దార్ సాజిదాబేగం, ఎంపీడీఓ నర్సింహులు ఉన్నారు.

ఫలించిన రైతుల పోరాటం

- భూ నిర్వాసితులకు పరిహారం చెల్లింపు
- ఎమ్మెల్యే చొరవతో రైతుల ఖాతాల్లో నగదు జమ

బషీరాబాద్: జీవన్గీ భూ నిర్వాసితుల పోరాటం ఎట్టకేలకు ఫలించింది. కాగ్నానదిపై నిర్మించిన వంతెనకు రెండువైపులా భూములు కోల్పోయిన రైతులు ఏడాదిగా పరిహారం కోసం పోరాటం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతులపై కేసులు కూడా నమోదయ్యాయి. అయితే జీవన్గీ గ్రామానికి చెందిన బషీరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాధవరెడ్డి ఈ విషయాన్ని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే సంబంధిత మంత్రితో మాట్లాడి పరిహారాన్ని మంజూరు చేయించారు. శుక్రవారం 19 మంది భూ నిర్వాసితుల ఖాతాల్లో ప్రభుత్వం నిధులు జమ చేసినట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ మాధవరెడ్డి తెలిపారు. ఒక్కో రైతుకు ఎకరాకు రూ.10 లక్షలు పరిహారం అందినట్లు చెప్పారు.

ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం

పరిహారం మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చిత్రపటానికి రైతులు క్షీరాభిషేకం చేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. మనోహర్‌రెడ్డి చొరవతోనే తమకు పరిహారం వచ్చిందన్నారు. త్వరలో ఎమ్మెల్యేకు సన్మానం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మాణిక్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు నర్సిరెడ్డి, రాములు, నారాయణరెడ్డి, భూనిర్వాసిత రైతులు అంపిరెడ్డి, సంగారెడ్డి, నర్సిరెడ్డి, శంకర్, ఫైజుల్లా గ్రామస్తులు చంద్రశేఖర్, నాగప్ప తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రైతులు, నాయకులు

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



ఎన్‌ఆర్‌ఎల్‌ఎం బృందం సభ్యులను సన్మానించిన గ్రామస్తులు

కడ్తాల్: ప్రభుత్వం అందించే పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎన్‌ఆర్‌ఎల్‌ఎం బృందం సభ్యులు డాక్టర్ సౌందరా పాండ్యన్, డాక్టర్ భక్తవత్సల పెరుమాళ్ అన్నారు. మండల పరిధిలోని చల్లంపల్లి, కర్కల్‌పహాడ్, గానుగుమార్లతండాల్లో శుక్రవారం జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో జాతీయ గ్రామీణా ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన పనులను పరిశీలించారు. ఆయా గ్రామాల్లో మహిళా సంఘాల పనితీరు, వివిధ రకాల పింఛన్ల పంపిణీ గురించి అడిగి తెలుసుకున్నారు. మహిళా సంఘాల ద్వారా రుణాలు తీసుకుని, స్వయం ఉపాధి పొందుతున్న మహిళలను కలిసి వివరాలు తెలుసుకున్నారు. ఆయా గ్రామ పంచాయతీల్లో గ్రామస్తులతో సమావేశమై గ్రామాల అభివృద్ధి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ అధికారులు కరుణశ్రీ, స్వేత, ఎంపీడీవో సుజాత, ఈజీఎస్ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.





పోలీసుల అదుపులో నిందితులు, స్వాధీనం చేసుకున్న క్లోరల్ హైడ్రేట్ కెమికల్

20కిలోల సీహెచ్ పట్టివేత

- ముగ్గురు నిందితులకు రిమాండ్
- జిల్లా వ్యాప్తంగా గట్టి నిఘా
- ఎస్పీ నారాయణరెడ్డి

కొడంగల్: కొడంగల్ మీదుగా అక్రమంగా తరలిస్తున్న 20 కిలోల క్లోరల్ హైడ్రేట్ కెమికల్‌ను జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు, కొడంగల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ నారాయణరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కల్తీ కల్లు తయారీలో సీహెచ్‌ను కలుపుతారని పేర్కొన్నారు. నమ్మదగిన సమాచారంతో కొడంగల్ అంబేడ్కర్ చౌరస్తా వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా స్విఫ్ట్ కారులో 10 కిలోల సీహెచ్ పట్టుబడినట్లు తెలిపారు. డ్రైవర్‌ను విచారించగా తన పేరు శ్రీకాంత్ గౌడ్ అని తండ్రి శ్రీనివాస్ గౌడ్, గ్రామం, మండలం బషీరాబాద్‌గా తెలిపాడు. తాను చించోలి గ్రామానికి చెందిన మేఘనాథ్ గౌడ్ వద్ద క్లోరల్ హైడ్రేట్ కెమికల్‌ను కొనుగోలు చేసినట్లు చెప్పాడు. మేఘనాథ్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా ఆయన దగ్గర 5 కిలోల సీహెచ్ దొరికింది. తాను చితాపూర్‌కు చెందిన ఉష్ణయ్య గౌడ్ దగ్గర కొనుగోలు చేస్తున్నట్లు పోలీసులకు తెలిపాడు. పోలీసులు ఉష్ణయ్యను అదుపులోకి తీసుకొని విచారించగా ఆయన వద్ద మరో 5 కిలోల సీహెచ్ దొరికింది. మొత్తం రూ.60 వేల విలువ గల 20 కేజీల సీహెచ్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. గంజాయి, నిషేధిత మత్తు పదార్థాలను అక్రమ రవాణా చేసినా, విక్రయించినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

క్లుప్తంగా

నేడు పార్కింగ్‌ నిర్వహణకు వేలం

ధారూరు: ధారూరు మెథడిస్టు క్రిస్టియన్‌ జాతర ఈనెల 12 నుంచి 17 వరకు కొనసాగుతుందని.. జాతరకు వచ్చే భక్తుల వాహనాలు పార్కింగ్‌ చేయడానికి పార్కింగ్‌ స్థలాన్ని ఎంపిక చేసినట్లు దోర్నాల్‌ గ్రామ పంచాయతీ కార్యదర్శి స్వాతి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పార్కింగ్‌ నిర్వాహణకు శనివారం పంచాయతీ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. ముందుగా కనీస రుసుము చెల్లించి వేలంలో పాల్గొనాలని ఆమె సూచించారు.

నేడు, రేపు ఓటర్ల నమోదుకు ప్రత్యేక శిబిరం

ధారూరు: నూతన ఓటర్ల నమోదుకు శని, ఆదివారం ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తహసీల్దార్‌ సాజిదాబేగం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కొత్త ఓటరు నమోదుకు ఫాం-6 దరఖాస్తు పూర్తి చేసి బీఎల్‌ఓలకు అందజేయాలని సూచించారు. 2025 జనవరి 1వరకు 18 ఏళ్లు నిండిన వారికి అవకాశం ఉంటుందన్నారు. మండల పరిధిలోని అన్ని గ్రామాలు, తండాల్లో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు బీఎల్‌ఓలు అందుబాటులో ఉంటారని చెప్పారు. ఈ నెల 28లోగా కొత్త ఓటరు నమోదుకు అవకాశం ఉందని వివరించారు.

సదరం సర్టిఫికెట్ల జారీలో అక్రమాలు

చర్యలు తీసుకోవాలని డిమాండ్‌

నవాబుపేట: అంగవైకల్యం ధ్రువీకరణ పత్రాలు జారీ చేసేందుకు నిర్వహిస్తున్న సదరం క్యాంపు లో అవినీతికి పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని వికలాంగుల సంఘం (ఎన్‌పీఆర్‌డీ) సభ్యులు డిమాండ్‌ చేశారు. బీపీఎం నర్సింలు, తాండూరు, వికారాబాద్‌ ఏరియా ఆస్పత్రిల కంప్యూటర్‌ ఆపరేటర్లు వెంకటేశం, సంతోశ్‌ తదితరులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌తో నవంబర్‌ 11న సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్‌ కార్యాలయం ముట్టడిస్తామని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్‌ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. తక్కువ శాతం వైకల్యం ఉన్నవారి వద్ద నుంచి రూ.25 వేల నుంచి రూ.50 వేలు వసూలు చేస్తూ సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారని ఆరోపించారు. వారి అక్రమార్కులను అడ్డుకునేందుకే కలెక్టర్‌ కార్యాలయం ముట్టడికి పిలుపునిస్తున్నామన్నారు. పెద్ద ఎత్తున దివ్యాంగులు పాల్గొనాలని కోరారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్‌

నవాబుపేట: పేకాట రాయుళ్లను అరెస్ట్‌ చేసిన సంఘటన మండలంలోని లింగంపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన ఐదుగురు మధ్యాహ్నం నిర్మానుష ప్రదేశంలో పేకాట ఆడుతున్నారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ అరుణ్‌కుమార్‌ తన సిబ్బందితో వెళ్లి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి ఐదు సెల్‌ఫోన్లు, రెండు బైక్‌లు, రూ.9వేల నగదు స్వాధీనం చేసుకొని అరెస్ట్‌ చేసి రిమాండు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

భార్య పుట్టింటికి వెళ్లిందని..

మనస్తాపంతో భర్త బలవన్మరణం

పరిగి: భార్య పుట్టింటికి వెళ్లడంతో మనస్తాపం చెందిన భర్త బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని రాపోల్‌ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ సంతోశ్‌ కుమార్‌ తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన ఎర్ర కుర్వ శేఖర్‌(29)కు తొమ్మిదేళ్ల క్రితం చిట్యాల గ్రామానికి చెందిన శిరీషతో వివాహమైంది. వీరికింకా సంతానం కాలేదు. నాలుగు నెలల క్రితం దంపతులు గొడవపడ్డారు. దీంతో ఆమె పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్తాపం చెందిన శేఖర్‌ ఈ నెల 5న పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో ఆయన్ను పరిగి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లి అక్కడి నుంచి నగరంలోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఆయన శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందాడు. మృతుడి అన్న శ్రీశైలం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతున్న మత్స్యకారుడి మృతి

కందుకూరు: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న మత్స్యకారుడు మృతి చెందాడు. వివరాలు.. కందుకూరుకు చెందిన ఎడ్ల ఉమాకాంత్‌ముదిరాజ్‌ (25) మత్స్యకారుడు. ఈ నెల 3న చేపలు పట్టే వలలు కొనుగోలు చేయడానికి సికింద్రాబాద్‌ మార్కెట్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా బోయిన్‌పల్లి సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని ఒవైసీ ఆస్పత్రిలో చేర్పించారు. గురువారం రాత్రి పరిస్థితి విషమించి మృతి చెందాడు.

సాగుకు ప్రణాళికలు



నర్సరీల్లో పెరుగుతున్న నారు (ఫైల్‌)

యాసంగిలో చలిని తట్టుకునే పంటలు వేసుకోవాలి

- కూరగాయల సాగుకు అనువైన సమయం
- జాగ్రత్తలు పాటించాలి
- మండల వ్యవసాయాధికారి లక్ష్మీప్రసన్న



నవాబుపేట: యాసంగిలో క్యాబేజీ, కాలిఫ్లవర్‌తో పాటు ఏడాది పొడువునా సాగు చేసే టమాట, మిర్చి, వంకాయ పంటలను సాగు చేసుకోవచ్చు. యాసంగిలో సూర్యరశ్మి ఎక్కువగా ఉంటుంది. వానాకాలంతో పోల్చితే దిగుబడులు ఎక్కువగా ఉంటాయి. కూరగాయల సాగులో నాణ్యమైన దిగుబడులు, తద్వార అధిక ఆదాయం పొందాలంటే రైతులు జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయాధికారి లక్ష్మీప్రసన్న సూచిస్తున్నారు.

స్వచ్ఛతను పరీక్షించుకోవాలి

విత్తన సంచిపై లేబుల్‌లో ఉన్న ప్రమాణాలు, మొలకశాతం, జన్యు స్వచ్ఛత, భౌతిక స్వచ్ఛత, ఇతర పదార్థాలను పరీక్షించుకుంటే మంచిది. మొలక శాతం 70 అంటే వంద గింజలను మొలకకు పెడితే అందులో కనీసం 70 విత్తనాలు మొలకెత్తుతాయి. జన్యుస్వచ్ఛత 98 శాతం అంటే 100 మొక్కలను పరిశీలిస్తే అందులో 98 మొక్కలు ఖచ్చితంగా సంబంధిత పంట రకం లక్షణాలు ఉండాలి. లేదంటే అవి నాసిరకం విత్తనాలు

విత్తన ప్రమాణాల పరీక్ష విధానం

విత్తన మొలక శాతం పరిక్షించిన తర్వాత నారుమడులు పెంచుకోవాలి. మొలక శాతం పరిక్షించుకోవాలి. ఫిల్టర్‌ పేపర్లు తీసుకుని పరీక్షించాల్సిన గింజలను పేపర్‌లో వరుసగా ఒక దాని పక్కన మరోటి పెట్టి పేపర్‌ చుట్టాలి. తదనంతరం చీకట్లో ఉంచి ఉదయం, సాయంత్రం నీటితో తడపాలి. వంకాయ, టమాట విత్తనాలు ఐదు నుంచి ఆరు రోజుల్లో మిరప 11 రోజుల్లో మొలకెత్తుతాయి. ఆ తర్వాత వంద విత్తనాలకు ఎన్ని మొలకెత్తితే అంత శాతంగా నిర్ధారించుకోవచ్చు.

మిరపలో విత్తన శుద్ధి

తెగుల్ల నివారణకు కిలో విత్తనానికి మూడు గ్రాముల మాంకోజెబ్‌ కలపి విత్తన శుద్ధి చేయాలి. రసం పీల్చే పురుగుల నివారణకు కిలో విత్తనానికి మూడు గ్రాముల ఇమిడా క్లోఫ్రిడ్‌, వైరస్‌ తెగుల్ల నివారణకు 150 గ్రాముల ట్రై సోడియం ఆర్థో ఫాస్ఫెట్‌తో విత్తన శుద్ధి చేయాలి. సెంటు నారు మడిలో 80 గ్రాముల ఫిప్రోనిల్‌ గుళికలు, మూడు గ్రాముల కాపర్‌ ఆక్సీక్లోరైడ్‌ ఒక లీటరు నీటిలో కలిపి నీరు మడిలో విత్తనం నాటిన 9,13 వ రోజుల్లో తడపాలి.

టమాట

రసం పీల్చే పురుగుల నుంచి కాపాడుకునేందుకు ఐదు గ్రాముల ఇమిడా క్లోఫ్రిడ్‌, తెగుళ్ల నివారణకు మూడు గ్రాముల థైరమ్‌ లేదా మూడు గ్రాముల మెటలాక్సిన్‌, ఆ తర్వాత నాలుగు గ్రాముల ట్రికోడెర్మివిరిడితో విత్తన శుద్ధి చేయాలి. విత్తే ముందు లీటరు నీటిలో మూడు గ్రాముల కాపర్‌ ఆక్సిక్లోరైడ్‌ చొప్పున కలిపి శుద్ధి చేస్తే నారు తెగుళ్ల ఆశించదు.

వంకాయ

ఎత్తయిన నారుమడులు పెంచడానికి విత్తనాలను నీటిలో 30 నిమిషాల పాటు నానబెట్టి నీడలో ఆరబెట్టాలి. ఆ తర్వాత థైరమ్‌ లేదా మాంకోజబ్‌, ట్రైకోడెర్మా విరిడితో విత్తన శుద్ధి చేయాలి. మాగుడు తెగులు నుంచి రక్షించడానికి లీటరు నీటిలో గ్రాముల కాపర్‌ ఆక్సిక్లోరైడ్‌ కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు మూడు సార్లు నారును తడపాలి.

ఉల్లిగడ్డ

కాప్రాన్‌ లేదా థైరామ్‌తో విత్తన శుద్ధి చేయాలి. నారు మడిలో విత్తనాన్ని వరుసలో పోయాలి. కాపర్‌ ఆక్సిక్లోరైడ్‌తో నారుకుళ్లు, కార్బోఫురాస్‌ గుళికలతో రసం పీల్చే పురుగులను నివారించవచ్చు.

క్యాబేజీ

కిలో విత్తనానికి మూడు గ్రాముల థైరమ్‌ను వాడాలి. లీటరు నీటికి మూడు గ్రాముల కాపర్‌ ఆక్సోక్లోరైడ్‌తో నేలను తడపాలి. దీంతో నారుకుల్లు తెగులు అదుపులో ఉంటుంది. లీటరు నీటిలో 2.5 మి.లీ తులాథియాన్‌ కలిపి పిచికారీ చేయాలి.

విత్తే సమయం

సిఫారసు చేసిన సమయంలోనే విత్తనం నాటుకోవాలి. లేత నారు లేదా ముదురు నారు నాటితే దిగుబడులు తగ్గే అవకాశాలు ఎక్కువ. సిఫారసు మేరకు వరుసల మధ్య దూరం, వరుసల్లోని మొక్కల మధ్య దూరాన్ని పాటిస్తేనే మొక్కల పెరుగుదల బాగుంటుంది. నిర్దేశిత సంఖ్యలో మొక్కలు ఉండేలా చూడాలి. అన్ని పంటల్లో 20 నుంచి 30 రోజుల వయసుగల నారును ప్రధాన పొలంలో నాటుకోవాలి. మిరప 40 నుంచి 42 రోజుల నారును నాటుకోవాలి.

చలికి సూక్ష్మధాతు పోషక లోపం

శీతాకాలంలో చలిని తట్టుకునే పంటలను ఎన్నుకోవాలి. సాగునీటి వసతి ఉంటేనే సాగుకు సిద్ధమవ్వాలి. స్థానికంగా ఆయా ప్రాంతాల్లో చీడ, పీడల సమస్యలను తట్టుకుని దిగుబడులు ఇచ్చే రకాలను ఎంపిక చేసుకోవాలి. సిఫారసు చేసిన వంగడాలనే సాగుకు వాడాలి. చలితో సూక్ష్మధాతు పోషకాలు లోపించే అవకాశాలు ఎక్కువ ఉన్నందున సూక్ష్మధాతు ఎరువులను సిద్ధంగా ఉంచుకోవాలి. కూరగాయల సాగులో హైబ్రిడ్‌ విత్తనాల వల్ల దిగుబడులు పెరుగుతాయి. నకిలీ విత్తనాలు, నాణ్యత లేని విత్తనాల కొనుగోలు చేయకుండా జాగ్రత్త పడాలి.

నారును పెంచే విధానం

నారును రెండు విధాలుగా పెంచవచ్చు. ఒకటి నారు మడుల విధానం, రెండోది ప్లగ్‌ట్రే విధానం. వంకాయ, మిరప, టమాటలో నారుకుల్లు తెగులు ఎక్కువగా ఉంటుంది. దీంతో మొక్కలు ఎక్కువగా చనిపోతాయి. ఇది నీటి ద్వారా ఇతర మొక్కలకు సోకి చనిపోతాయి. ఎకరా పొలంలో నాటేందుకు సరిపడా విత్తనం పెంచడానికి 4మీటర్లు పొడవు, మీటరు వెడల్పు నారుమడులు ఎనిమిది నుంచి పది తయారు చేసుకోవాలి. ఆరున్నర ఇంచులు అనగా భూమిపై నుంచి 15 సెంటీ మీటర్లు ఎత్తులో ఉండేలా తయారు చేసుకోవాలి. దీంతో అధికంగా ఉండే నీరు నారులో నిలువ ఉండకుండా బయటకు వెలుతుంది. తెగుల్ల భయం ఉండదు.

సర్వే పేరిట సైబర్‌ మోసాలు

- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- మున్సిపల్‌ కమిషనర్‌ విక్రమ్‌ సింహారెడ్డి



తాండూరు టౌన్‌: కుల గణన సర్వే అడ్డుపెట్టుకుని జరిగే సైబర్‌ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్‌ కమిషనర్‌ విక్రమ్‌ సింహారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో సూచించారు. సర్వే మ్యాన్యువల్‌గా కొనసాగుతుందని.. ఆన్‌లైన్‌లో సర్వే చేస్తున్నట్లు ఫోన్‌లు చేసినా, వాట్సాప్‌ తదితర సందేశాలు పంపించినా ప్రజలు వివరాలు తెలపవద్దన్నారు. ఎన్యుమరేటర్లు మీ ఇంటికి ముఖాముఖిగా మాత్రమే వివరాలు సేకరిస్తారని చెప్పారు.

నారాయణీయం పారాయణం



పారాయణం చేస్తున్న మహిళలు

అనంతగిరి: కార్తీకమాసం పురస్కరించుకుని వికారాబాద్‌ పట్టణానికి సమీపంలోని అనంతగిరిగుట్ట శ్రీ అనంతపద్మనాభ స్వామి ఆలయంలో శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన మంజుల భాగవతుల శిష్య బృందంతో నారాయణీయం పారాయణం నిర్వహించారు. అనంతరం ఆలయంలో అర్చకులు శేషగిరి పంతులు ప్రత్యేక హారతి తీర్థ ప్రసాదాలు అందించి ఆలయ చరిత్ర, స్థల పురాణం గురించి వివరించారు. కార్యక్రమంలో యాస్కి శ్రీదేవి, ఉప్పలంచి లక్ష్మి, యాస్కి అనితలతో వికారాబాద్‌, పరిగి, శంకర్‌పల్లి ప్రాంతానికి చెందిన పలువురు మహిళలు పాల్గొన్నారు.

కార్తీక మాసంలో ఆర్టీసీ టూర్‌ ప్యాకేజీ

వికారాబాద్‌ డిపో మేనేజర్‌ అరుణ్‌

చేవెళ్ల: కార్తీక మాసంలో పంచారామాలు దర్శించుకునేందుకు భక్తులకు ఆర్టీసీ ప్రత్యేక ప్యాకేజీని అందిస్తుందని వికారాబాద్‌ డిపో మేనేజర్‌ అరుణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్తీక మాసం సందర్భంగా టీజీఎస్‌ఆర్టీసీ ఈ ప్రత్యేక ప్యాకేజీ అందిస్తుందని.. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్తీక సోమవారం రోజున పరమ శివుడి దర్శనం చేసుకునే భక్తుల కోసం ప్రభుత్వం ఈ ప్రత్యేక బస్సు సర్వీసులను ప్రారంభించిందన్నారు. హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్‌ హైదరాబాద్‌-2 డిపో నుంచి ఈ బస్సులు రాకపోకలు సాగిస్తాయని చెప్పారు. నవంబర్‌లో వచ్చే ప్రతీ ఆదివారం సాయంత్రం 5గంటలకు బస్సులు బయలుదేరుతాయని చెప్పారు. దర్శనాంతరం బస్సు మంగళవారం ఉదయం 10గంటలకు హైదరాబాద్‌ చేరుకుంటాయన్నారు. ఈ టూర్‌ ప్యాకేజీలో అమరావతి(అమరేశ్వరాలయం), భీమవరం (సోమేశ్వరాలయం), పాలకొల్లు (క్షీర రామలింగేశ్వరాలయం), సామర్లకోట (కుమారరామ భీమేశ్వరాలయం) దర్శించునే అవకాశం ఉంటుందని చెప్పారు. వినియోగించుకోవాలనుకునే వారు ఆర్టీసీ అధికారిక వెబ్‌సైట్‌లో ముందస్తుగా రిజిస్ట్రేషన్‌ చేసుకోవాలన్నారు. హైదరాబాద్‌ చుట్టు పక్కల ప్రాంతాల ప్రజలు తమ దగ్గరలోని బస్‌ స్టాండ్‌లతో పాటు సమీప టీజీఎస్‌ఆర్టీసీ రిజర్వేషన్‌ కౌంటర్ల బుక్‌ చేసుకోవచ్చునని చెప్పారు. ఈ టూర్‌ ప్యాకేజీకి సంబంధించిన పూర్తి సమాచారం కోసం ఫోన్‌ నెంబర్లు హైదరాబాద్‌-2 డిపో 9959226249, 7382838010, వికారాబాద్‌ డిపో 9959226252, 7382839610 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఆకతాయిల ఆటకట్టిస్తాం

వికారాబాద్‌ ఎస్‌ఐ సత్యనారాయణ

అనంతగిరి: ట్రాఫిక్‌ నిబంధనలపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని వికారాబాద్‌ ఎస్‌ఐ సత్యనారాయణ సూచించారు. శుక్రవారం వికారాబాద్‌లోని శ్రీ చైతన్య స్కూల్‌లో షీ టీం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళల రక్షణ ధ్యేయంగా షీ టీం పనిచేస్తోందన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయన్నారు. విద్యార్థులు కష్టపడి చదువుకుని తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలన్నారు. షీటీం పబ్లిక్‌ ప్రదేశాల్లో మఫ్టీలో ఉంటుందన్నారు. అమ్మాయిలను ఇబ్బంది కలిగించేవారి ఆట కట్టిస్తామన్నారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దన్నారు. ఫిర్యాదులు ఉంటే షీటీం కంప్లైంట్‌ బాక్స్‌లో వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్‌, షీటీం సిబ్బంది పాల్గొన్నారు.



షీటీం కంప్లైంట్‌ బాక్స్‌

చోరీ కేసులో ఇద్దరికి రిమాండ్‌

పరారీలో నలుగురు నిందితులు



నిందితులు అస్లాం, సాబేర్‌

తాండూరు రూరల్‌: మోటార్‌ వైండింగ్‌ దుకాణంలో జరిగిన చోరీ కేసును కరన్‌కోట్‌ పోలీసులు ఛేదించారు. ఆరుగురు ముఠాలో శుక్రవారం ఇద్దరిని అరెస్ట్‌ చేయగా మరో నలుగురు పరారీలో ఉన్నారు. కరన్‌కోట్‌ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. సెప్టెంబర్‌ 30న అల్లాపూర్‌ గేటు వద్ద ఉన్న అస్మిత మోటార్‌ వైడింగ్‌ షాపు తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. బాధితుడు కిరణ్‌ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టి సాంకేతికత ఆధారంగా నిందితులు మహారాష్ట్రలోని నాందేడ్‌ జిల్లా వాసులుగా గుర్తించారు. వారిలో అస్లాం, సాబేర్‌ను పట్టుకుని విచారించగా ఆరుగురు ముఠా సభ్యులు నంబర్‌లోని డీసీఎంతో రెక్కీ నిర్వహించి అస్మిత వైడింగ్‌ షాప్‌లో చోరీకి పాల్పడినట్లు చెప్పారు. దొంగిలించిన సామగ్రిని నగరంలోని ఓ స్క్రాప్‌ దుకాణంలో విక్రయింగా రూ.50 వేల నగదు వచ్చిందన్నారు. అస్లాం, సాబేర్‌లను రిమాండ్‌కు తరలించగా ఫెరోజ్‌,షాదుల్లా, షేక్‌ జబ్బు, ఖ్యూమ్‌ పరారీలో ఉన్నారన్నారు.

బైక్‌ చోరీ కేసులో పాత నేరస్తుడి అరెస్ట్‌



కాశప్ప(ఫైల్‌)

తాండూరు రూరల్‌: గతంలో మూడు చోరీలకు పాల్పడిన దుండగుడు శుక్రవారం మరో కేసులో పోలీసులకు చిక్కాడు. కరన్‌కోట్‌ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. ఓగిపూర్‌ గ్రామానికి చెందిన చౌవన్‌ రవి తన బైక్‌ను గురువారం ఇంటి వద్ద పార్క్‌ చేశాడు. శుక్రవారం ఉదయం వెళ్లి చూడగా బైక్‌ కనిపించలేదు. దీంతో ఆయన కరన్‌కోట్‌ పోలీసులను ఆశ్రయించాడు. కరన్‌కోట్‌కు చెందిన వడ్డె కాశప్ప ఉదయం కరన్‌కోట్‌ నుంచి తాండూరుకు బైక్‌పై ప్రయాణిస్తున్నాడు. పోలీసులు కాశప్పను విచారించగా తానే బైక్‌ చోరీ చేసినట్టు ఒప్పుకొన్నాడు. గతంలో లారీ దొంగతనం చేసి డీజిల్‌ అయిపోవడంతో మధ్యలో వదిలేశాడు. ఇప్పటికే మూడు కేసుల్లో నిందితుడైన కాశప్పలో మార్పు రాలేదని.. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపారు.



క్రీడాకారులతో టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్‌ మధుయాష్కీగౌడ్‌

క్రీడలకు ప్రభుత్వం పెద్దపీట

మధుయాష్కీ గౌడ్‌

హుడాకాంప్లెక్స్‌: క్రీడాకారులు గ్రామీణ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదిగేలా రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్‌ మధుయాష్కీగౌడ్‌ అన్నారు. తెలంగాణ స్పోర్ట్స్‌ అథారిటీ ఆధ్వర్యంలో సరూర్‌నగర్‌ ఇండోర్‌ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమానికి మధుయాష్కి ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులకు క్రికెట్‌ కిట్లను అందజేశారు. ఇండోర్‌ స్టేడియాన్ని పరిశీలించి మాట్లాడుతూ అవసరమైన వసతులు కల్పించేందుకు ముఖ్యమంత్రితో మాట్లాడతానని హామీ ఇచ్చారు. రేవంత్‌రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని క్రీడాకారులతో కలిసి మధుయాష్కి కేక్‌ కట్‌ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల అధికారి వెంకటేశ్వర్‌రావు, క్రికెట్‌ కోచ్‌ రాజశేఖర్‌, నాయకులు మకుటం సదాశివుడు, లింగాల కిషోర్‌గౌడ్‌, బద్దుల వేణుగోపాల్‌ యాదవ్‌, శ్రీపాల్‌రెడ్డి, కుట్ల నరసింహ యాదవ్‌, కందికంటి శ్రీధర్‌గౌడ్‌ పాల్గొన్నారు.

రింగ్‌ రైల్‌ నిర్మాణానికి ఏరియల్‌ సర్వే



సర్వేకు సిద్ధం చేసిన మిషన్‌

కొందుర్గు: రీజినల్‌ రింగ్‌ రోడ్డుకు సమాంతరంగా రింగ్‌ రైల్‌ నిర్మాణానికి ఏరియల్‌ సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్వీ అసోషియేషన్‌ ఏజెన్సీ ప్రతినిధులు శుక్రవారం సర్వే ప్రారంభించారు. రెండు నెలల క్రితం కొందుర్గు మండలంలోని రేగడిచిల్కమర్రి, ముట్పూర్‌, ఉత్తరాసిపల్లి, బైరంపల్లి, మహదేవ్‌పూర్‌, కొందుర్గు, తంగెళ్లపల్లి మీదుగా రీజినల్‌ రింగ్‌రోడ్డు ఏర్పాటుకు మార్కింగ్‌ చేసిన చిహ్నాల ఆధారంగా రింగ్‌రోడ్డుకు సమాంతరంగా రింగ్‌ రైల్‌ ఏర్పాటుకు సర్వే పనులు చేపట్టారు. మరో రెండు రోజుల్లో హెలీకాప్టర్‌తో ఈ గ్రామాల్లో సర్వే పనులు పూర్తిచేయనున్నట్లు సమాచారం.

అజ్ఞాతంలోకి మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌

పదవికి నటరాజ్‌ రాజీనామా



రాజీనామా పత్రాన్ని కమిషనర్‌ వెంకన్నకు అందజేస్తున్న నటరాజ్‌

షాద్‌నగర్‌: మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌, 16వ వార్డు కౌన్సిలర్‌ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఎంఎస్‌.నటరాజ్‌ తెలిపారు. శుక్రవారం ఆయన తన రాజీనామా పత్రాన్ని మున్సిపల్‌ కమినర్‌ వెంకన్నకు అందజేశారు. అనంతరం ఎంఎస్‌.నటరాజ్‌ మాట్లాడుతూ.. మానవసేవయే మాధవ సేవగా భావించి 1988 నుంచి రాజకీయంలో ఉన్నానని.. పట్టణంలోని క్రిస్టియన్‌కాలనీ(16వ వార్డు) ప్రజలు మొదటి సారిగా కౌన్సిలర్‌గా గెలిపించారని.. అనంతరం మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌ మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌గా అవకాశం కల్పించారని గుర్తు చేశారు. నన్ను ఆదరించి గెలిపించిన వార్డు ప్రజలకు, వైస్‌ చైర్మన్‌ చేసిన మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నా వ్యక్తిగత కారణాల వలన కౌన్సిలర్‌, వైస్‌ చైర్మన్‌ పదవులకు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. రాజీనామా ప్రతులను సీడీఎంఏ హైదరాబాద్‌, జిల్లా కలెక్టర్‌, అడిషనల్‌ కలెక్టర్‌కు పంపుతున్నట్లు ఆయన తెలిపారు. బాధ్యత కలిగిన బీఆర్‌ఎస్‌ కార్యకర్తగా పార్టీలోనే కొనసాగుతానని చెప్పారు. నటరాజ్‌ రాజీనామాను ఉపసంహరింపజేసేందుకు మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌ ప్రయత్నాలు చేశారు. ఎంఎస్‌.నటరాజ్‌ అజ్ఞాతవాసంలోకి వెళ్లడంతో అంజయ్యయాదవ్‌ ప్రయత్నాలు ఫలించలేదని తెలుస్తోంది.

పార్క్‌ చేసిన బైక్‌ చోరీ

తలకొండపల్లి: ఇంటి ఎదుట పార్క్‌ చేసిన బైక్‌ను గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. ఈ ఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీకాంత్‌ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని చుక్కాపూర్‌కు చెందిన కల్లు రాజేందర్‌రెడ్డి, ఆయన చిన్నాన్న రామిరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల 6న ఇళ్లకు తాళాలు వేసి తిరుపతి వెళ్లారు. ఇంటి ఎదుట గ్లామర్‌ బైక్‌ను పార్క్‌ చేసి వెళ్లారు. శుక్రవారం ఉదయం కమటం అంజమ్మ వారి ఇళ్లను శుభ్రం చేసేందుకు వెళ్లింది. దీంతో ఆమె తాళాలు పగులగొట్టినట్లు గుర్తించి ఇంటి యజమానులకు సమాచారం ఇచ్చింది. దీంతో విషయం తెలుసుకున్న వారు వచ్చి చూడగా వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. ఇంట్లో విలువైన వస్తువులు ఏమీ దొంగతనం జరుగలేదు. సమాచారం అందుకు పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని ఇళ్లను పరిశీలించారు. కల్లు రాజేందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



ఘటనా స్థలిని పరిశీలిస్తున్న పోలీసులు

ఫార్మాసిటీపై పునరాలోచన చేయాలి

ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు

యాచారం: కాంగ్రెస్‌ పెద్దలు అధికారంలోకి వచ్చిన తర్వాత ఫార్మాసిటీ రద్దుపై మాటమారుస్తున్నారని, పైగా పట్టా భూములు ఇవ్వాలని అధికారుల చేత రైతులను భయాందోళలనకు గురి చేస్తున్నారని ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌ హాల్‌లో శుక్రవారం సమన్వయకర్తలు కవులు సరస్వతి, కుందారపు నారాయణ ఆధ్వర్యంలో కుర్మిద్ద, తాడిపర్తి, నానక్‌నగర్‌, నక్కర్తమేడిపల్లి గ్రామాల రైతులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు సీతక్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు అధికారంలోకి రాకముందు ఫార్మాసిటీకి వ్యతిరేకంగా మాట్లాడిన మాటలను గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఫార్మాసిటీని రద్దు చేస్తామని, పట్టా భూములు తీసుకోబోమని హామీలు ఇచ్చారని అన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ ఫార్మాసిటీ ఏర్పాటు చేస్తామని, పట్టా భూముల సేకరణ కోసం రైతులపై తీవ్ర ఒత్తిళ్లు చేస్తున్నారని విమర్శించారు. పట్టా భూముల సేకరణ నిలిపేసి టీజీఐఐసీ పేరు మీద మార్చేసిన పట్టా భూముల రికార్డులను తిరిగి రైతుల పేర్ల మీద నమోదు చేయాలని డిమాండ్‌ చేశారు. ఫార్మాసిటీకి సేకరించిన భూముల్లోనే ఫ్యూచర్‌ సిటీ, నెట్‌ జీరో సిటీ, స్కిల్‌ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తామనడం సరైంది కాదన్నారు. ఫార్మాసిటీ రద్దుపై పునరాలోచన చేయకపోతే మరో పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. అనంతరం ఫార్మాసిటీకి వ్యతిరేకంగా కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో నాయకులు కానమోని గణేశ్‌, ముత్యాల మహిపాల్‌రెడ్డి, సామ నిరంజన్‌, బందె రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

అమనగల్లు: ప్రభుత్వం గత ఏడాది జూలై నుంచి రావాల్సిన పీఆర్‌సీని వెంటనే అమలు చేయాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందంగౌడ్‌ డిమాండ్‌చేశారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించకుండా న్యాయం చేయాలని కోరారు. పట్టణంలోని ఎస్టీయూ భవన్‌లో శుక్రవారం మండల మహాసభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సదానందంగౌడ్‌ మాట్లాడుతూ.. ప్రభుత్వం పీఆర్‌సీ అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తోందని ఆవేదన వ్యక్తంచే శారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఎస్టీయూ పోరాడుతోందని తెలిపారు. తమ పోరాటాల ఫలితంగానే ఉపాధ్యాయులకు సంబంధించిన అనేక సమస్యలు పరిష్కారమయ్యాయని గుర్తుచేశారు. ఉపాధ్యాయులకు రావాల్సిన నాలుగు పెండింగ్‌ డీఏలను వెంటనే మంజూరు చేయాలని, హెల్త్‌కార్డులు అన్ని కార్పొరేట్‌ ఆస్పత్రుల్లో పనిచేసే విధంగా చూడాలని, 317 జీఓ బాధిత ఉపాధ్యాయులకు స్థానికత ఆధారంగా వారి సొంత జిల్లాలకు కేటాయించాలని ఆయన డిమాండ్‌ చేశారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత కరెంట్‌ అందిస్తూ ప్రభుత్వం జీఓ జారీ చేయడంపై హర్షం వ్యక్తంచేశారు. సమస్యల పరిష్కారానికి చేసే పోరాటానికి ఉపాధ్యాయులు మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కత్తి నర్సింహారెడ్డి, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి సదయ్య, రాష్ట్ర నాయకులు కృష్ణారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, పోల్‌రెడ్డి, రవి, రామసుబ్బారావ్‌, భూపాల్‌, కసిరెడ్డి పురుషోత్తంరెడ్డి, పరమేశ్వర్‌, జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌, ప్రధాన కార్యదర్శి పాండురంగారెడ్డి, మండల అధ్యక్షుడు కసిరెడ్డి అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సదానందంగౌడ్‌